

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**DECEMBER-2014**

సంవత్సర చందా రూ. 50/-

# టి.వి ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

**సత్యవాణి :**

**ఆదివారం సాయంత్రం** : 6.00 గంటలకు శుభవార్త

**బుధవారం సాయంత్రం** : 6:30 గంటలకు రక్షణ

**గురువారం ఉదయం** : 11:00 గంటలకు రక్షణ

ప్రసంగీకులు : జాషువా గూటం

రిక్కీ గూటం

రోనీ గూటం

శ్రేష్ఠమైన జీవితం : Better Life

మంగళ, గురువారాల్లో - ఉదయం 7:30 గంటలకు రక్షణ

బుధ, శుక్రవారాల్లో - ఉదయం 9:30 గంటలకు రక్షణ

ప్రసంగీకులు : పలివెల మణికుమార్

పై కార్యక్రమములను టి.విలో చూడండి. మీ బంధు మిత్రులన కూడ ప్రోత్సహించండి. ఉచిత బైబిలు కోర్సుకొరకు మాకు ఈరోజ వ్రాయండి


SATYA VANI

P.O.BOX.80, KAKINADA

Pin : 533004

Ph : 0884- 2363722,

Cell: 9848998547

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH


P.o. Box -80, Kakinada,A.P. 533 001
Ph : 0884 - 2363722
Moble : 9848998547
Editor :
**Joshua Gootam**


*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 34 | డిశంబరు - 2014 | సంచిక - 5


## తీర్పు జరుగు దినము
### (The Day of Judgement)

మానవులందరినీ ఒక దినమందు దేవుడు తీర్పు తీర్చునని బైబిలు బోధించుచున్నది. ఆయన ఇప్పుడు మానవులకు న్యాయము తీర్చుచుండినను, అంత్య దినమందు ఆయన మానవులందరకు తాము దేహముతో జరిగించిన క్రియలన్నిటికి తీర్పుతీర్చును. అలనాడు కయీను తన తమ్ముడైన హేబెలును హత్య చేయగా, "నీతమ్ముని రక్తమును నీచేతిలో నుండి పుచ్చుకొనుటకు నోరు తెరచిన యీ నేల మీద ఉండకుండ నీవు శపించబడిన వాడవు; నీవు నేలను సేద్యపరచునప్పుడు అది తన సారమును ఇకమీద ఇయ్యదు, నీవు భూమిమీద దిగులుపడుచు దేశదిమ్మరివై యుందువని" చెప్పి దేవుడు అతనిని శపించెను (అది 4:10,11). అహరోను కుమారులైన నాదాబు అబీహులు యెహోవా తన కాజ్ఞాపింపని వేరొక అగ్నిని ఆయన సన్నిధికి తేగా యెహోవా సన్నిధి నుండి అగ్ని బయలుదేరి వారిని కాల్చివేసెను (లేవీ 10:12). ఉజ్జా అనునతడు తన చేయిచాపి తొణికి

సలాడుచున్న దేవుని మందసమును పట్టుకొనగా యెహోవా కోపము అతని మీద రగులు కొనెను. దేవుడు అతని మొత్తగా అతడు అక్కడనే దేవుని మందసమునొద్ద పడి చనిపోయెను (2 సమూ 6:7). దేవుడు అట్లు తన తీర్పును మానవుల యెడల ప్రత్యక్ష పరచుటలో అనేక కారణము లున్నవి. మొదటిగా ఆయన శాసనములు యధార్ధమైనవని నిరూపించుటకు, న్యాయమును చేకూర్చుటకు ఆయన తీర్పుతీర్చును. రెండవదిగా ఆయన ద్వారా న్యాయము తీర్చబడుట చూచిన వారందరు నేరము చేయకుండ జాగ్రత్తగా యుండు నిమిత్తము ఆయన న్యాయము చేకూర్చును. అందుకే పూర్వమందు వ్రాయబడినవన్నియు మనకు బోధ కలుగు నిమిత్తము వ్రాయబడి యున్నవని రోమా 15:4 చెప్పుచున్నది.

అందువలన తీర్పు దినము ఒకటి యున్నదని క్రొత్త నిబంధన ఖచ్చితముగా బోధించుచున్నది. "మనుష్యులొక్కసారే మృతి పొందవలెనని నియమింపబడెను; ఆ తరువాత తీర్పు జరుగును" అని హెబ్రీ 9:27లో వ్రాయబడి యున్నది. "ఎందు కనగా తాను జరిగించిన క్రియల చొప్పున అవి మంచివైననుసరే చెడ్డవైననుసరే, దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మన మందరము క్రీస్తు న్యాయపీఠము యెదుట ప్రత్యక్షము కావలయును" అని 2 కొరింథి 5:10లో వ్రాయబడి యున్నది.

భూలోకమునకు తీర్పుతీర్చుటకు దేవుడొక దినమును నిర్ణయించి యున్నాడు. "తాను నియమించిన మనుష్యుని చేత నీతిననుసరించి భూలోకమునకు తీర్పు తీర్చబోయెడి యొక దినమును నిర్ణయించి యున్నాడు. మృతులలో నుండి ఆయనను లేపినందున దీనిని నమ్ముటకు అందరికిని ఆధారము కలుగుజేసి యున్నాడు" (అపొ.కా. 17:31). ఆ దినమే క్రీస్తు రెండవ రాకడ దినము (యోహాను 5:28,29). ఆ దినమే ఈలోకము అంతమయ్యే దినము (2 పేతురు 3:7) అని క్రొత్త నిబంధన బోధించుచున్నది.

భూలోకమునకు తీర్పు తీర్చుటలో దేవుడు తన శాసనముల యధార్ధతను నిరూపించును. శాసనమును ఉల్లంఘించు వానికి శిక్ష సంభవించవలెను. ఆ శిక్షయే మరణము. ఏలయనగా పాపము వలన వచ్చు జీతము మరణము (రోమా 6:23). అందువలన మానవుడు దేవుని శాసనముల

నెట్లు గైకొనునోయను దానిని గూర్చి అతడు దేవునికి లెక్క యొప్పగించవలెను.

తీర్పు దినమందు దేవుడు ఆఖరిగా న్యాయమును తీర్చును. దేవుని శాసనమునుల్లంఘించుట వలన మానవుడు భూమిపై శిక్షను తప్పించుకొని యుండవచ్చును. అయితే ఆదినమందు అతడు తప్పించుకొనలేడు. ఏలయనగా ఆయన ప్రతివానికి వాని వాని క్రియల చొప్పున ప్రతిఫల మిచ్చును. సత్క్రియను ఓపికగా చేయువారికి నిత్య జీవితము నిచ్చును. అయితే భేధములు పుట్టించి, సత్యమునకు లోబడక దుర్నీతికిలోబడువారి మీదికి దేవుని ఉగ్రతయు రౌద్రమును వచ్చును (రోమా 2:6-11).

దేవుని న్యాయ తీర్పు దినమందు దేవుని సమక్షమున ప్రతివాని యొక్క నిజస్థితి బయలు పరబడును. ఆయన ఇప్పుడు మనందరి హృదయాలోచనలను, అంతరంగిక జీవితమును యెరిగినవాడే అయినను, ఆదినమందు మన నిజస్థితిని ఆయన బయలుపరచును. మనకు ఆయన ఆశ్చర్యకరమైన జ్ఞాపకశక్తిని ఇచ్చియున్నాడు గనుక ఆనాడు బయలుపరచబడు మన క్రియలను మనము కాదనలేము. భూమిపై జీవించునంత కాలము ఆయన మనకొక మనస్సాక్షి నిచ్చి యున్నాడు. దానినిబట్టి తప్పు చేయగా మనస్సాక్షిచే గద్దించబడినవారమైతిమి. అటుతరువాత మన ప్రవర్తనయే మనలను గూర్చి సాక్ష్యమిచ్చును. వీటన్నిటిని బట్టి మన నిజస్థితి దేవుని యెదుట బట్టబయలగును.

దేవుని న్యాయ తీర్పు దినమందు ఆయన మానవులను తమతమ నిత్య నివాసములలోనికి ప్రవేశింపజేయును. అట్టి నిత్య నివాసములు రెండే రెండు కలవు. ఒకటి నిత్యజీవము రెండు నిత్యనరకము. ఆ తీర్పు దినమందు సమస్త జనులు ఆయన యెదుట పోగుచేయ బడుదురు: గొల్లవాడు మేకలలో నుండి గొర్రెలను వేరుపరచునట్లు ఆయన నీతిమంతులను, అనీతిమంతులను వేరుచేయును. అప్పుడు నీతిమంతులు నిత్యజీవమునకును, అనీతిమంతులు నిత్యశిక్షకును పోవుదురు (ఆ గొప్ప తీర్పు దృశ్యమును విపులముగా తెలుసు కొనుటకు మత్తయి 25:31-46 చదవండి).

నిజానికి ఆ యాఖరి దినమందు మనకు యెవరు తీర్పు తీర్చెదరు? దేవుడే మనకు తీర్పు తీర్చునను సంగతి మనందరము యెరిగినదే అయినను

ఆయన క్రీస్తు ద్వారా మనలను తీర్పు తీర్చును. "తండ్రి యెవనికిని తీర్పు తీర్చడు గాని తండ్రిని ఘనపరచునట్లుగా అందరును కుమారుని ఘనపరచవలెనని తీర్పు తీర్చుటకు సర్వాధికారమును కుమారునికి అప్పగించి యున్నాడని" యేసు పలికెను (యోహాను 5:22,23). మరింకొకచోట "నేను చెప్పిన మాటయే అంత్యదినమందు తీర్పుతీర్చును అని యేసు చెప్పెను (యోహాను 12:48). సువార్త వాక్యమును ప్రకటించుట ద్వారా అపొస్తలులు, పరిశుద్ధులు కూడ ఈలోకమునకు తీర్పు తీర్చెదరని వ్రాయబడి యున్నది (మత్తయి 19:28, 1 కొరింథి 6:2,3).

దేవుని న్యాయతీర్పు దేనిపై ఆధారపడి యుండును? అని మన నడుగవచ్చును. మన నామములు జీవగ్రంథమందున్నవో లేవో అను దానిపై అది ఆధారపడి యుండును. గొప్ప వారేమి కొద్ది వారేమి, అందరు దేవుని సింహాసనము ఎదుట ఆనాడు నిలువబడుదురు. అప్పుడు గ్రంథములు విప్పబడును. ఆ గ్రంథములయందు వ్రాయబడి యున్న వాటిని బట్టి తమ క్రియల చొప్పున వారికి తీర్పు తీర్చబడును. ఎవని పేరైనను జీవగ్రంథమందు వ్రాయబడినట్లు కనబడని యెడల వాడు అగ్ని గుండములో పడవేయబడును అని ప్రకటన 20: 12-15 లో వర్ణించబడినది.

జీవగ్రంథములో మన పేరు ఎట్లు చేర్చబడును? మనము క్రీస్తు సువార్తను విని, విశ్వసించి, మారుమనస్సు పొంది, పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిననాడు మన పేరు అందు చేర్చబడును. అయితే క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినంత మాత్రముననే సరిపోదు. మనము మరణ పర్యంతము ఆయనకు నమ్మకముగా యుండవలెను లేనియెడల మన పేరు దానినుండి కొట్టివేయబడును. నీవు క్రైస్తవుడవయిన యెడల క్రీస్తునందు నిలిచియుండి (యోహాను 15:4,5), ఆత్మానుసారముగ నడుచుకొనుచు, విశ్వాస సహితమయిన జీవితమును చివరివరకు జీవించిన యెడల నీనామము ఆ జీవగ్రంథమందు కనబడును. ఆ దినమందు మనము నిజక్రైస్తవులమో లేక వేషధారులమో కూడ బయలుపర్చబడును. ఆ దినమందు మన జీవితమంతయు బట్టబయలు చేయబడును. మన రహస్య తలంపులు క్రియలు బయలుపర్చబడును; అందు వలన ఆ దినము రహస్యములను విమర్శించు

దినమని పౌలు చెప్పెను (రోమా 2:6). అంతే కాదు మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతిమాటను గూర్చియు ఆదినమందు లెక్క చెప్పవలసి యుండు నని యేసు చెప్పెను (మత్తయి 12:36). మనము చేయగలిగియు చేయకుండిన సంగతుల కొరకు కూడ ఆదినమందు మనము లెక్క చెప్పవలసి యుండును (యాకోబు 4 :17).

దేవుడు పక్షపాతికాడు (రోమా 2:11) గనుక ఆయన అందరికీ తీర్పు తీర్చు ఆదినమందే దేవునిపై తిరుగు బాటు చేసిన దేవదూతలకు కూడ ఆయన తీర్పు తీర్చును (2 పేతు 2:4; మత్తయి 25:41). దేవుని న్యాయతీర్పు దినమున దుర్మార్గులు నాశనమొందు దురు,గొప్ప వేదనను, నరకమును వారనుభవించుటకు పోదురు. అది వారికి భయంకరదినము, దేవుని ఉగ్రత వారిపై కుమ్మరింపబడే దినము. ఆనాటి నుండి వారు దేవుని సన్నిధిని నిత్యము కోల్పోవుదురు, అది అతిఘోరమైన రెండవ మరణము.

దేవుని న్యాయ తీర్పుదినము నీతిమంతులకు ఆహ్లాదకర దినము. అది మహిమ ప్రభావములు గల దినము గొప్ప విజయ దినము. అది నిత్య జీవితమును, దేవుని సన్నిధిని, నిత్య శాంతిని పొందే దినము. అదే మోక్షము. మనము ఈభూమి పై జీవించుచుండగా మన నిత్యజీవితమును ఎక్కడ గడపవ లెనని అనుకొనుచున్నామో ఇప్పుడే నిర్ణయించుకొనవలెను. దీనికి ఒకే ఒక్క సూత్రమున్నది. క్రీస్తును నమ్మి ఆయనకు లోబడుము. సువార్తను నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడును, నమ్మ నొల్లని వానికి శిక్ష విధింపబడుననని అందుకే యేసు చెప్పెను (మార్కు 16:16). నీవు కోరుచున్నదేమిటి? నిత్య రక్షణా ? లేక నిత్యశిక్షా? ఆలోచించుకొనుము.

***సత్యవాణి టి.వి కార్యక్రమములు :***

| | |
|---|---|
| ప్రతి ఆదివారం సాయం | **6గం॥లకు శుభవార్త** |
| ప్రతి బుధవారం సాయం | **6:30 గంటలకు రక్షణ** |
| ప్రతి గురువారం ఉదయం | **11:00 గం॥లకు రక్షణ** |

www. satyavanicoc.com

# అన్యాయస్థుడైన గృహనిర్వాహకుడు
## (The Unjust Steward)
### లూకా 16:1-13

**పరిచయము :**

లూకా 15లో యేసు మూడు ఉపమానములు చెప్పిన తరువాత మరికొన్ని ఉపమానములు చెప్పెను. సుంకరులును పాపులును ఆయన బోధ వినుటకు ఆయన యొద్దకు వచ్చుచుండిరి (లూకా 15:1). ఆయన బోధించుచుండగా జనసమూహములో పరిసయ్యులు, శాస్త్రులు కూడ యుండే వారు. స్వనీతీపరులైన పరిసయ్యులు, శాస్త్రులకు ఒక పాఠముగా ఆయన లూకా 15లో యున్న ఉపమానములు చెప్పెను.

లూకా 16లో ఆయన తన శిష్యులకు ఈ ఉపమానము చెప్పెను. ఆయన చెప్పిన అన్యాయస్థుడైన గృహ నిర్వాహకుని ఉపమానము వినిన తరువాత పరిసయ్యులు ఆయనను విమర్శించిరి. "ధనాపేక్షగల పరిసయ్యులు ఈ మాటలన్నియు విని ఆయనను అపహసించిరి" యని లూకా 16:14 చెప్పుచున్నది. ఈ ఉపమానములో దేవుని రాజ్యములో యున్న బాధ్యతలు, వాటి లెక్కలను గూర్చి ఆయన బోధించెను.

**ఉపమానము :**

ఆయన ఇట్లు చెప్పెను. "ఒక ధనవంతుని యొద్ద ఒక గృహనిర్వాహకుడుండెను. వాడతని ఆస్తిపాడు చేయుచున్నాడని అతని యొద్ద వానిమీద నేరము మోపబడగా అతడు వాని పిలిపించి -నిన్ను గూర్చి నేను వినుచున్న యీ మాటలేమిటి? నీ గృహనిర్వాహకత్వపు లెక్క అప్పగించుము; నీవు ఇకమీదట గృహనిర్వాహకుడవై యుండ వల్లకాదని వానితో చెప్పెను. ఆగృహ నిర్వాహకుడు తనలోతాను -నా యజమానుడు ఈ గృహనిర్వాహకత్వపు పనిలోనుండి నన్నుతీసి వేయును గనుక నేను ఏమి చేతును? త్రవ్వ లేను, భిక్షమెత్తసిగ్గుపడుచున్నాను. నన్ను ఈ గృహ నిర్వాహకత్వపు పనిలో నుండి తొలగించునప్పుడు వారు నన్ను తమ యిండ్లలోనికి చేర్చుకొనునట్లు ఏమి చేయవలెనో నాకు తెలియుననుకొని తన యజమాని రుణస్థులలో ఒక్కొక్కని పిలిపించి-నీవు నాయజమానునికి ఎంత అచ్చియున్నావని మొదటి వానినడిగెను. వాడు నూరు మణుగుల నూనె అని చెప్పగా - నీవు నీచీటి తీసికొని త్వరగా కూర్చుండి యేబది మణుగులని వ్రాసి కొమ్మని వానితో చెప్పెను. తరువాత

వాడు నీవు ఎంత అచ్చియున్నావని మరి యొకనినడుగగా వారు నూరుతూములు గోధుమలని చెప్పినప్పుడు వానితో– నీవునీ చీటితీసికొని యెనుబది తూములని వ్రాసి కొమ్మని చెప్పెను. అన్యాయస్థుడైన ఆ గృహ నిర్వాహకుడు యుక్తిగా నడుచు కొనెనని వాని యజమానుడు వానిని మెచ్చుకొనెను. వెలుగు సంబంధుల కంటె ఈ లోక సంబంధులు తమ తరమును బట్టి చూడగా యుక్తిపరులై యున్నారు. అన్యాయపుసిరివలన మీకు స్నేహితులను సంపాదించుకొనుడి; ఎందుకనగా ఆసిరి మిమ్మును వదిలి పోవునప్పుడు వారు నిత్యమైన నివాసము లలో మిమ్మును చేర్చుకొందురని మీతో చెప్పుచున్నాను, మిక్కిలి కొంచెములో నమ్మకముగా ఉండువాడు ఎక్కువలోను నమ్మకముగా ఉండును. మిక్కిలి కొంచెములో అన్యాయముగా ఉండు వాడు ఎక్కువ లోను అన్యాయముగా ఉండును. కాబట్టి మీరు అన్యాయపు సిరి విషయంలో నమ్మకముగా ఉండని యెడల సత్యమైన ధనమును ఎవరు మీ వశము చేయును? మీరు పరులసొమ్ము విషయములో నమ్మకముగా ఉండని యెడల మీ సొంతమైనది మీకు ఎవడి చ్చును? ఏ సేవకుడు ఇద్దరు యజమాను లను సేవింపలేడు; వాడు ఒకని ద్వేషించి ఒకని ప్రేమించును, లేదా ఒకని అనుస రించి ఒకని తృణీకరించును; మీరు దేవునిని సిరిని సేవింపలేరని చెప్పెను" (లూకా 16 : 1–13).

**గృహనిర్వాహకుడు :**

గృహనిర్వాహకుడనగా ఎవరో మనము మొదట తెలిసికొనవలెను. వేరొకని ఆస్థియొక్క బాధ్యత అప్పగించ బడినవాడు గృహనిర్వాహకుడు. ఆదికాండము 39లో యోసేపు ఒక గృహనిర్వాహకుడై యుండెను. "యోసేపు మీద పోతీఫరుకు కటాక్షము కలిగెను గనుక అతనియొద్ద పరిచర్య చేయువాడై యుండెను. అతడు తన యింటిమీద విచారణకర్తగా అతని నియమించి తనకు కలిగిన దంతయు అతని చేతి కప్ప గించెను...అతడు తనకు కలిగిన దంతయు యోసేపు చేతికప్పగించి తాను ఆహారము తినుట తప్ప తనకేమి ఉన్నదో ఏమిలేదో విచారించినవాడు కాదు" (ఆదికా 39:4–6).

తన బిడ్డలందరు మంచి గృహ నిర్వాహకులై యుండాలని దేవుడు కోరు చున్నారు. "తగిన కాలమున ప్రతివానికి ఆహారము పెట్టుటకు యజమానుడు తనయింటివారి మీద నియమించునట్టి నమ్మకమైన బుద్ధిగల గృహనిర్వాహ కుడెవడు?" అని యేసు అడిగెను (లూకా 12:42). గృహనిర్వాహకులు గొప్ప బాధ్యత అప్పగింపబడినవారు (లూకా

12:42-48). గృహనిర్వాహకుడు లెక్క అప్పగించు బాధ్యతగలవాడు (మత్తయి 25:34-40).

తమకు కలిగి యున్నది తమది కాదనే సంగతిని క్రైస్తవులు కూడ మరతురు. సమస్తము దేవునికి చెందినవే (కీర్తన 50:10-11; యెహెజ్కే 18:4). దేవుడు మన కనుగ్రహించిన దీవెనలకు మనము కేవలము గృహనిర్వాహకులమే.

ఈలోక సంపద అంతయు దేవునిదే (కీర్తన 20 : 1). అది మనకు చెందినది కాదు, కేవలము ఎరువుగా ఈయబడినదే. మంచి గృహనిర్వాహకులుగా మనం బాధ్యత నిర్వహించాలి.

అన్యాయస్థుడైన గృహనిర్వాహకుడు:

ఈ ఉపమానములో చెప్పబడిన వాడు అన్యాయస్థుడు. అతని మీద అన్యాయముగా అపనింద మోపబడిన దనడానికి యేమీ అవకాశము లేదు. అతనిపై మోపబడిన నమ్మకాన్ని వమ్ము చేసాడనడానికి సందేహము లేదు. అతని యజమాని ఆస్థి అతనికి అప్పగింపబడెను. యజమానునికి లాభము చేకూరేలాగున దానిని అతడు వినియోగించాలి. గాని అతడట్లు చేయలేదు.

1కొరింథీ 4:1-2లో సువార్తను గూర్చిన గృహనిర్వాహకత్వము మనకు అప్పగింపబడి యున్నదని పౌలు చెబుతాడు. "ఈలాగున క్రీస్తు సేవకులమనియు, దేవునిమర్మముల విషయములో గృహనిర్వాహకులమనియు ప్రతిమనుష్యుడు మమ్మును భావింపవలెను. మరియు గృహనిర్వాహకులలో ప్రతివాడును నమ్మకమైనవాడై యుండుట అవశ్యము".

గృహ నిర్వాహకుడెవరో తెలిసికొనిన తరువాత ఈ ఉపమాన ములో యున్నవాడు అన్యాయస్థుడని, అవినీతి పరుడని మనం గ్రహించాలి. ఈ ఉపమానం అంతా ఇతనిచుట్టూనే యున్నది గనుక ఇతని గూర్చి మనకు ఇంకా ఎక్కువ చెప్పబడతాది. అతని యజమానియైన ధనవంతుడు తన పరిధిలో వ్యాపారము చేసికొనుచు యదార్థవంతునిగానే కనబడుచున్నాడు. ధనవంతులగుటకు అపేక్షించువారు శోధనలోను ఉరిలోను అవివేకయుక్తములును హానికరములైన అనేక దురాశలలోను పడుదురు. అట్టివి మనుష్యలను నష్టములోను నాశనములోను ముంచివేయును. ఎందుకనగా ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము; కొందరు దానిని ఆశించి విశ్వాసము నుండి తొలగిపోయి నానాభాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి" (1 తిమోతి 6:9-10).

బైబిలులో నమ్మకమైన విశ్వాసులగు అబ్రాహాము, యోబు మొదలగు

వారు ధనవంతులే.

ఈ అన్యాయస్థుడైన గృహ నిర్వాహకుడు తాను పట్టుబడ్డాడని ఎరుగును. మరియు మరికొంత కాలానికి తన ఉద్యోగము ఊడిపోవునని కూడ ఎరుగును. ఇట్లు ఉద్యోగమునుండి తీసివేయబడిన తరువాత వానికెవడు ఇంకో ఉద్యోగము ఇయ్యడని కూడ అతడెరుగును. "నా యజమానుడు ఈ గృహనిర్వాహకత్వపు పనిలో నుండి నన్ను తీసివేయును గనుక నేనేమి చేతును? త్రవ్వలేను, భిక్షమెత్త సిగ్గుపడుచున్నాను" అని అతడు తలంచెను (లూకా 16:3). అకస్మాత్తుగా అతనికొక అక్రమ ఆలోచన కలిగింది! తన యజమానికి అచ్చియున్న వారిని తానే మచ్చిక చేయదలచుకొన్నాడు. అప్పుడు తనకు ఉద్యోగము లేకున్నా, జీవనోపాధిలేకున్నా వారతనికి ఆతిథ్యమిత్తురు (లూకా 16:4). అట్లు ఈ గృహ నిర్వాహకుడు తన మోసపూరిత సంకల్పాన్ని అమలు పరచదలచాడు. తన యజమాని రుణస్థులు కూడ దానిలో ఇష్టపూర్వకముగా పాలిభాగస్థులవుదురనుకొన్నాడు. నిజానికి వారందుకు అంగీకరించారు (5-7 వచనములు).

అతని అక్రమ సంకల్పాన్ని యజమాని ఎరిగియుండినను అతడా గృహనిర్వాహకుని అభినందించాడు. అతడు చేసిన మోసమును కాదుగాని, తన అక్రమ క్రియల పర్యవసానము నుండి అతడు తప్పించుకొనిన విధానమును ఆ యజమానుడు అభినందించాడు. మోసపూరిత క్రియనుగాక, అతని తెలివి తేటలను అతడు అభినందించాడు. మోసపూరిత క్రియనుగాక, అతని ప్రజ్ఞను యేసు అభినందించారు. అతడు తన భవిష్యత్తుకొరకు సరిగ సిద్ధపడ్డాడు. మనం ఈ లోకంలో నిరంతరము ఉండబోము. గనుక భవిష్యత్తు కొరకు సరిగ సిద్ధపడాలి.

అతని ప్లాను చాల సులభమైనది. యజమాని రుణస్థుల రికార్డులను తారుమారుచేసి వారి కృతజ్ఞతను పొందగోరాడు. అతని ఉద్యోగము పోయిన తరువాత వారికి అతడు చేకూర్చిన అక్రమ లాభాన్ని బట్టి తమ యిండ్లలోనికి అతనిని చేర్చుకొందురు. ఈ కుట్రను యజమానుడు తెలిసికొని అతనిపై ఆగ్రహము తెచ్చుకొనుటకు బదులు అన్యాయస్థుడైన ఆ గృహనిర్వాహకుడు యుక్తిగా నడుచుకొనెనని గ్రహించి అతని అభినందించెను. ఈ ఉదంతములోని వ్యక్తులందరు అక్రమకారులే. గృహనిర్వాహకుడు అన్యాయస్థుడు. అతడు క్రమ క్రమముగా తన యజమాని సొమ్ము దొంగిలించుచు వచ్చాడు. పట్టుబడిన తరువాత కూడ అబద్ధములాడుచు తప్పించుకొనజూ

వాడు. రుణపడినవారు కూడ అన్యాయ స్థులే. తాము అచ్చియున్న యజమానిని మోసము చేయుటకు గృహనిర్వాహకునితో చేతులు కలిపారు. తప్పు లెక్కలు వ్రాసుకున్నారు. యజమాని కూడ చేతివాటము గలవాడే. గృహనిర్వాహకుడు తననే మోసము చేయుచుండినా అతని కుయుక్తిని అభినందించాడు.

8వ వచనంలో అ ధనవంతుడు తన గృహనిర్వాహకుని తెలివితేటలను మెచ్చుకొన్నాడు. లేఖనాలలో మరొకచోట విభిన్న రీతిలో ఒక తారతమ్యాన్ని గూర్చి చెప్పారు. "ఇదిగో తోడేళ్ల మధ్యకు గొర్రెలను పంపినట్లు నేను మిమ్మును పంపుచున్నాను గనుక పాములవలె వివేకులును పావురములవలె నిష్కపటులునై యుండుడి" యని ఆయన చెప్పారు (మత్తయి 10:16). సాధారణంగా మనం పాముల గుణగణాలను గూర్చి ఆలోచించము. తదుపరి పాములకు పావురములకు యున్న సంబంధాన్ని మనము ఊహించుకొనలేము. అవి రెండు ఒక దానికొకటి పొసగవు. లూకా 16:8లో అఖరి భాగమున, ఈ ఉపమానము ద్వారా మనము నేర్చుకొనదగిన పాఠమున్నది. "వెలుగు సంబంధులకంటె ఈ లోక సంబంధులు తమ తరమును బట్టి చూడగ యుక్తి పరులై యున్నారు". ఈ ఉపమానములో జరిగించబడిన అన్యాయమును కాదుగాని, ఒక పని జరిగించుటలో యున్న ఆతురతను, శ్రద్ధను గూర్చి మనము నేర్చుకొనాలి. ఈ లోకములో విజయవంతులైన వ్యాపారుల వివేకమును, శ్రద్ధను, దూరచూపును చూచి మనము నేర్చుకొనాలని యేసు యొక్క ఉద్దేశ్యమై యున్నది.

క్రైస్తవులు క్రైస్తవ్యమును వ్యాప్తి చేయటకు కలిగిన శ్రద్ధ భక్తుల కంటె ఈలోకస్థులు ధనార్జన చేయుటకు చూపించు శ్రద్ధ భక్తులు అధికమైనవి. గృహ నిర్వాహకుడు తన భవిష్యత్తును భద్రము చేసికొనుటకు కుటిలప్రయత్నములన్నీ చేసాడు; యుక్తి గల ఈ చోరునితో రుణస్తులు కూడ తమ చేతులు కలిపారు; ధనవంతుడైన యజమాని కూడ జరుగుతున్న అక్రమాన్ని గూర్చి పట్టించుకోనట్లున్నాడు. లోకస్థులు తమ వ్యాపారము నిమిత్తము కలిగియున్న శ్రద్ధను, దేవుని రాజ్య విస్తరణ పనిలో క్రైస్తవులు కలిగియుంటే ఈ లోకములో ఎంత తేడా కన్పించునో గదా!

యిది ఎంత నిజము! మనము దేవుని బిడ్డలము (వెలుగు సంబంధులము). అయినను మనకు కావలసిన దానిని గూర్చి (పరలోక గృహమును గూర్చి) ఈ లోకస్థులు తమకు కావలసిన వాటిని గూర్చి చూపించు విజ్ఞతను

కూడ మనము కలిగియుండము. ఆత్మీయ విషయాలలో మనము కనుబరచు జ్ఞానము కంటె ఈ లోకస్థులు భౌతిక విషయాలను గూర్చి ప్రదర్శించు జ్ఞానము గొప్పది.

లూకా 16:9లో యేసు అసంభావ్యమైన హెచ్చరిక ఇచ్చుచున్నట్లుగుపడుచున్నది. "అన్యాయపు సిరివలన మీకు స్నేహితులను సంపాదించుకొనుడి. ఎందు కనగా ఆసిరి మిమ్మును వదలిపోవునప్పుడు వారు నిత్యమైన నివాసములలో మిమ్మును చేర్చుకొందురని మీతో చెప్పుచున్నాను". సిరి అనగా ధనము. ధనము పాపము కాదు, పాపము చేయదు. గాని పాపము చేయుటకు ధనము వినియోగించబడును.

'అన్యాయపుసిరి' అనగా మన చేతికి అప్పగింపబడిన ధనము. దేవుని బిడ్డల చేతికి అప్పగింపబడిన ధనమును వారు తమ నిత్య నివాసము కొరకు వివేకముతో వెచ్చించాలి. తాత్కాలికమైన ఈలోక సంపద నిత్యసంపద ఇక్కడ పోలికగా చెప్పబడినవి. "భూమిమీద మీ కొరకు ధనమును కూర్చుకొనవద్దు; ఇక్కడ చిమ్మెటయు తుప్పును తినివేయును. దొంగలు కన్నము వేసి దొంగిలిదెరు. పరలోకమందు మీకొరకు ధనము కూర్చుకొనుడి; అచ్చట చిమ్మెటయైనను, తుప్పైనను దాని తినివేయదు, దొంగలు కన్నము వేసి దొంగిలరు. నీ ధనమెక్కడనుండునో అక్కడనే నీ హృదయముండును" (మత్తయి 6:19-21).

లూకా 16:9లో మానవులందరు సిద్ధపడినను, సిద్ధపడక పోయినను ఎదుర్కొన వలసిన మరణమును గూర్చి ఉచ్చరించడమైనది. "ఆసిరిమిమ్మును వదలిపోవునప్పుడు" అను మాటలు మీకు మరణము సంభవించునప్పుడు అని చదువుకొనవచ్చును.

లూకా 16:10-12 వచనాలలో తమకు అప్పగించబడిన ఆర్థిక బాధ్యతలను శ్రద్ధతో నిర్వహించుచు పరలోక నివాసము కొరకు సిద్ధపడాలని యేసు తన శిష్యులను ప్రోత్సహించారు. 13వ వచనములో ఒక దానితో నొకటి పొసగని జీవన విధానమును గూర్చి చెప్పబడినది. ఒకడు దేవునిని, సిరిని సేవింపలేడు. ఇందులో మధ్యస్థస్థితి యేమీ లేదు. ఏ సేవకుడు ఇద్దరు యజమానులను సేవింపలేడు; వాడు ఒకని ద్వేషించి ఒకని ప్రేమించును, లేక ఒకని అనుసరించి ఒకని తృణీకరించును. మీరు దేవునిని సిరిని సేవింప లేరని" యేసు చెప్పెను (లూకా 16:13).

యేసు ప్రభువు ఈ ఉపమానము చెప్పిన వెంటనే పరిసయ్యులు ఆయనను అపహసించిరి (16:14). పరిసయ్యులు ధనాపేక్షగలవారు గనుక ఆయన చెప్పిన ఉపమానము వారికి గుచ్చుకొన్నది.

**ముగింపు :**

ధనాపేక్షను గూర్చి హెచ్చరించుటకు ప్రాథమికముగా ఈ ఉపమానము చెప్పబడినది. మరియు ఆర్థిక సంబంధమైన దీవెనలు పరలోక నివాసము కొరకు వివేక విజ్ఞతతో వినియోగించాలి.

యేసు ఈ ఉపమానమును తన శిష్యులకు చెప్పెను గాని పరిసయ్యులు కూడ దానిని వినుచుండిరి. రెండు సంగతులు ఆయన బోధింప గోరారు. 1) తరుణములను జ్ఞానయుక్తముగా వాడుకోవాలి 2) ధనపేక్ష లోభత్వము వలన ప్రమాదము కలుగును. విశ్వాసులు సరియైన మనస్తత్వము కలిగి తమ ధనాన్ని లోక వ్యాపారులవలె జ్ఞానముగా వినియోగించిన యెడల, దేవుని రాజ్యము కొరకు వారు ఎక్కువ చేయుగలరు.

– లూయిస్ రష్మోర్

## రూపములు - ప్రతిరూపములు
## (Types and Antitypes)

### దేవుని బల్యర్పణ పద్ధతి -3

పాతనిబంధన స్టడీలో రూపములు, ప్రతిరూపముల (Typology) భాగమొకటియున్నది. Tupos and Antitupos అనురెండు గ్రీకుపదముల నుండి ఈ పదములుద్భవించెను. Tupos అనగా రూపకము, Antitypes అనగా దాని ప్రతిరూపము, లేదా దాని అచ్చు రూపము. అది ఒక అర్కిటెక్ట్యిచ్చే యింటిప్లాన్వలె యుండును. దానిలో కొన్ని ఆశ్చర్యకరమైన వివరణలుండును, తదుపరి ఆ నమూనా ఒక బిల్డింగ్వలె తయారగును. ఒక స్త్రీ నమునాను తీసికొని దానిని బట్టి ఒక డ్రస్ కుట్టుకొనునట్లుండును. టైపోలజీ భవిష్యత్ వాస్తవముల నమూనాలకు సంబంధించినది. అవి రాబోవు నిజస్వరూపము యొక్క ప్రతిరూపములు.

పాతక్రొత్తనిబంధనల తారతమ్యమును చూపించుటకు గాను హెబ్రీ పత్రిక లేఖకుడు ఈ రూపము ప్రతిరూపముల పద్ధతిని విరివిగా ఉపయోగించాడు.

**ఛాయలు – నిజస్వరూపములు**
**(Shadows and Realities)**

ఈటైపోలజీలో మరొక భాగమున్నది. అది ఛాయ నిజస్వరూప మనునది. అది నీడను కల్పించు అసలైన వాస్తవము. ఈ ఛాయలను గూర్చి క్రొత్త నిబంధనలో ఎక్కువ మనకుకనబడును. హెబ్రీ పత్రిక 3,4 అధ్యాయాల్లో ఇశ్రాయేలీయులు ఐగుప్తును వీడి వాగ్దానము చేయబడిన దేశమునకు నిష్క్ర

మించుట రాబోవు పరలోకవాస్తవము యొక్క ఛాయయైయున్నది.

హెబ్రీ 8:5లో లేఖకుడు హెబ్రీయుల మందిరమగు ప్రత్యక్ష గుడారమును గూర్చి మనకు తెలియజేస్తాడు. అది నిజానికి భౌతికం గాని యేసుక్రీస్తు యొక్క ఆత్మీయ మందిరముకు అదొక ఛాయ రూపకమై యున్నది. హెబ్రీ లేఖకుడు గ్రీకు మాటలను ఈసమానాంతరము వర్ణించుటకు వినియోగించాడు. అతడు ఛాయను గూర్చి, మాదిరిని గూర్చి, నమూనాను గూర్చి అక్కడ చెబుతాడు. గనుక ఇశ్రాయేలీయుల ప్రత్యక్షగుడారము యేసుక్రీస్తు యొక్క మందిరము యొుక్క ఛాయయై యుండెను.

హెబ్రీ 9:23లో పరలోకమందున్నవాటిని పోలిన వస్తువులను గూర్చి (అనగా పాతనిబంధన లోనివాటిని గూర్చి) లేఖకుడు చెబుతాడు. అవి జంతుబలుల వలన శుద్ధి చేయబడుచుండెను. అయితే పరలోక సంబంధ వస్తువులు వీటికంటే శ్రేష్టమైన బలుల ద్వారా శుద్ధిచేయ బడవలసియుండెను. పాతనిబంధన ఒక ఛాయ. దాని అసలైన నిజస్వరూపము క్రొత్తనిబంధన.

యూదులబలులు, ధర్మశాస్త్రము ఒక ఛాయయని హెబ్రీ 10:1 చెప్పుచున్నది: "ధర్మశాస్త్రము రాబోవుచున్న మేలుల ఛాయ గలదియే గాని ఆ వస్తువుల నిజస్వరూపము గలది కాదు గనుక ఆయాజకులు ఏటేట ఎడతెగ కుండ అర్పించు ఒక్కటే విధమైన బలులు వాటిని తెచ్చువారికి ఎన్నడును సంపూర్ణసిద్ధి కలుగజేయనేరవు". గనుక హెబ్రీయులు అర్పించేబలులన్నియు ఛాయల వంటివి మాత్రమే.

కొలస్స 2:16లో యూదుల ఆహార నియమాలను గూర్చి పౌలు చెబుతాడు. వారి పానీయములు, పండుగలు, అమావాస్య, పున్నములు, సబ్బాతులు మొదలగు వాటిననుసరించుటలేనందున ఎవడును క్రైస్తవులను తప్పుపట్టరాదు. ఇవన్నియు ఛాయలు మాత్రమే. నిజస్వరూపము క్రీస్తులో యున్నది. "కాబట్టి అన్నపానముల విషయములోనైనను పండుగ అమావాస్య విశ్రాంతి దినము అను వాటి విషయము లోనైనను మీకు తీర్పుతీర్చ నెవనికిని అవకాశమియ్యకుడి. ఇవి రాబోవు వాటి ఛాయయేగాని నిజస్వరూపముక్రీస్తులో ఉన్నది" (కొలస్స 2:16). పైన చెప్పబడిన లేఖనభాగము లన్నియు రూపకములే. అవి ప్రవచనాత్మకములు. నిజానికి యేసు అనేక ఉపమానములలో ఈరకమైన టైపోలజీనే వినియోగించారు. రాజ్యములో ప్రజల యొక్క బాధ్యతలను గూర్చి, దాని యొక్క మహిమను గూర్చి ఆయన రూపకాలం

కారముగా బోధించెను.

**ఛాయల యొక్క సంకుచిత తత్వము (Limited Nature of Shadows)**

ఛాయలు భవిష్యత్తును సూచించుటయే గాక, దేని వలన వాటి నీడ పడుచున్నదో ఆనిజస్వరూపమును కోరుకొనును. ఆదికాండము 1:26లో మానవుడు దేవునిస్వరూపమందు సృజింపబడెనని మనకు చెప్పబడినది. హెబ్రీ భాషలో 'స్వరూపము' అనుమాటకు ఛాయయని చెప్పబడినది. అంటే మానవుడు నిజానికి దేవుని యొక్క లోతైన ఆత్మీయ జ్ఞానయుక్తమైన ఛాయ అన్నమాట! మానవుని ఆఛాయ నిజస్వరూపమును కోరుకొనుచున్నది. జ్ఞాని యొక్క ఆత్మీయ వాస్తవము, మనలను సృజించిన ఆత్మీయ దేవుని యొక్క లక్షణములు, నిజస్వరూపములో యున్నవి. మానవుడు తన సృష్టికర్తయైన దేవుని ఛాయ.

ఛాయలను గూర్చిన వాస్తవం యేమంటే అవి వాటికవే ఉనికి కలిగి యుండలేవు. ఒకనిజస్వరూపంలేకుండా దాని నీడ యుండనేరదు. నీడదేనివలన కలిగెనో ఆ వస్తువు, వాస్తవం తప్పక యుండును. ఒక చెట్టునీడను తీసికొని మనం యిల్లుకట్టు కొనలేము, ఒక్కోసారి నిజరూపము కంటే దాని ఛాయముందు మనకు కనబడును. యిట్టిది నీవు గమనించే యుంటావు. సూర్యాస్తమయమున సాయంకాలపు వేళ మన ఛాయ చాలపొడవుగా యుండును. ఒక్కోసారి పెద్ద భవనమునకు మనము చేరక ముందే దాని పొడవైన నీడలో మనం నిలబడి యుండవచ్చును. గనుక నిజవస్తువుకు ముందు దాని ఛాయ అగుపడడం మనం ఎరిగిన సంగతే. అయితే కొద్ది సమయములోనే ఆనీడలోనుండి మనం నిజస్వరూపము దగ్గరకు చేరుకొనగలము. పాతనిబంధన కూడ అట్టిదే. అది క్రొత్త నిబంధన యొక్క ఛాయయైయున్నది.

**క్రీస్తు అన్నిటిని నెరవేర్చారు (Christ Fulfills it all)**

క్రీస్తుయొక్క బలులు బహుళార్థములని హెబ్రీ 9:23 తెలియజేయుచున్నది. ఏలయనగా ఆయన యొక్క బలిలో, ఒకే ఒక్క బలిలో, యూదుల బల్యర్పణ పద్ధతిలోని అనేకాంశములు యిమిడియున్నవి. ఇంకొక మాటలో మోషేధర్మశాస్త్ర ప్రకారము అనేక బలులుండెను. అవన్నియు క్రీస్తుయొక్క బలిలోని అనేక సంగతులను సూచించును, ప్రవచించును.

- ఇశ్రాయేలీయుల దహన బలి అర్పణలో క్రీస్తు దేవుని కొరకు ప్రతిష్ఠింపబడుట కనబడును.
- ప్రథమ ఫల అర్పణలో, లోకములో రక్షింపబడిన వారిని క్రీస్తు ప్రథమ

ఫలముగా దేవునికి అర్పించుట కన బడును.

– సమాధాన బలియర్పణలో క్రీస్తు మానవాళికి అనుగ్రహించు సమాధానము కనుగొనగలము.

– పాపపరిహారార్థబలిలో ఆయన యొక్క ప్రాయశ్చిత్తము అగుపడును.

– అపరాధ పరిహారార్థబలిలో యేసుక్రీస్తు దేవుని యొక్క నీతిని నీతిమంతులను కాపాడుట మనకు కనబడును.

– పాపపరిహారార్థ దినమున పాతనిబంధన లోని మాదిరులను క్రీస్తు నెరవేర్చుట యేగాక, ఆబల్యర్పణలో యాజకుని విధులను నెరవేర్చుటకూడ గమనించ గలము.

– పస్కాలో యేసుక్రీస్తు తన ప్రజలను పాపపు బానిసత్వము నుండి విమోచించుట గమనించగలము.

ఎఱ్ఱని పెయ్యి అర్పణలో పాపము యొక్క ఆత్మీయ, భౌతిక మాలిన్యములను క్రీస్తు నిర్మూలించుటను గమనించ గలము.

వీటన్నిటిలోను క్రీస్తు యొక్క మహిమార్థమైన బలి యొక్క భావము ఇమిడి యున్నది. అది కల్వరి కొండపై మానవాళి కొరకు ఒకే ఒక్కసారి అర్పించబడెను.

## నిశ్చలమైన రాజ్యము

(హెబ్రీ 12:28)

కదల్చబడని, నిశ్చలమైన రాజ్యము ను గూర్చి హెబ్రీ పత్రిక రచయిత మనకు చెబుతున్నారు. ఆ రాజు ఎవరు? ఎవరిని గురించి ఆతడు మాట్లాడుతున్నాడు? రోమీయుల యొక్క బానిసత్వమునుండి తమను విడిపించగల రాజు కొరకు రోమా సామ్రాజ్యంలోని యూదులు ఎదురుచూస్తున్నారు (అపొ.కా. 1:6). "ఇదిగో నీవు గర్భము ధరించి కుమారుని కని ఆయనకు యేసు అని పేరుపెట్టుదువు, తండ్రియైన దావీదు సింహాసనమును ఆయనకిచ్చును. ఆయన యాకోబు వంశస్థులను యుగయుగములు ఏలును.

ఆయన రాజ్యము అంతము లేనిదై యుండును" అని గబ్రీయేలు దూత మరియతో చెప్పింది (లూకా 1:31-33, దానియేలు 7:13-14).

తూర్పుదేశపు జ్ఞానులు తూర్పు దిక్కున నక్షత్రమును చూచారు. వారి లేఖనాలు యూదుల రాజును గూర్చి వారికి తెలిపాయి. వారు హేరోదురాజు నొద్దకు వచ్చి "యూదుల రాజుగా

పుట్టినవాడెక్కడనున్నాడు? తూర్పు దిక్కున మేము ఆయన నక్షత్రము చూచి ఆయనను పూజింపవచ్చితిమని చెప్పిరి. (మత్తయి 2 : 2).

గలిలయసముద్ర తీరంలో యేసుప్రభువు 5,000 మంది పురుషులు అసంఖ్యాకమైన స్త్రీలు, పిల్లలకు ఐదురొట్టెలు రెండుచిన్నచేపలతో ఆహారం పెట్టారు. అది చూసిన యూదులు కొందరు ఆశ్చర్యపడి ఆయనను రాజుగా చేయుటకు ప్రయత్నించారు. గాని, ఆయన రాజ్యము భూలోక సంబంధమైనది కాదు గనుక ఆయన ఒంటరిగా కొండప్రాంతాలకు తప్పించుకొని వెళ్లిపోయారు. (యోహాను 6:15; 18:36).

ఆయన శిష్యులలో ఒకని ద్వారా యేసుప్రభువు మోసగింపబడి పిలాతు ఎదుట నిలువబడినపుడు గవర్నరు ఆయనను అడిగాడు –"యూదుల రాజువు నీవేనా ?" అని "యేసు అతని చూచి – నీవన్నట్టే అనెను". (మత్తయి 27:11; మార్కు 15: 2–5; యోహాను 18:37). సైనికులు ఆయన సిలువకు పైగా " యూదులరాజైన యేసు" (మత్త 27:37, యోహా 18:37) అని వ్రాసి పెట్టారు. అపొస్తులుడైన పౌలు కూడా యూదులు, అన్యజనుల మధ్య రాజైన యేసుక్రీస్తును గూర్చి బోధించారు (అపొ.కా. 17:7). తిమోతికి కూడ ఆయన ఇలాచెబుతున్నారు "శ్రీమంతుడును, అద్వితీయుడునగు సర్వాధిపతి .... రాజులకు రాజును ప్రభులకు ప్రభువునైయున్నాడు" (1 తిమోతి 6:15). "ఆయన భూపతులకు అధిపతి" (ప్రకటన 1:5) అని చెప్పబడ్డారు. "వీరు గొర్రెపిల్లతో యుద్ధము చేతురుగాని.... ఆయన ప్రభువులకు ప్రభువును, రాజులకు రాజునై యున్నారు (ప్రకటన 17:14).

రాజులకు రాజు ప్రభువులకు ప్రభువు అయిన ఆయన ఇపుడు సింహాసనాసీనులై ఏలుచున్నారు. హెబ్రీ గ్రంధకర్త ఇలా అంటున్నారు "ఆయన దేవుని మహిమ యొక్క తేజస్సును, ఆయన తత్వము యొక్క మూర్తిమంతమునై యుండి, తన మహత్తు గల మాటచేత సమస్తమును నిర్వహించుచు పాపముల విషయములో శుద్ధీకరణము తానేచేసి దేవదూతల కంటే ఎంత శ్రేష్టమైన నామము పొందెనో వారికంటే అంత శ్రేష్టుడై ఉన్నత లోకమందు మహామహుడగు దేవుని కుడిపార్శ్వమున కూర్చుండెను" (హెబ్రీ 1:3–1; 10:12). "నేను జయించి నాతండ్రితో కూడ ఆయన సింహాసనమునందు కూర్చుండి యున్న ప్రకారము జయించు

వానిని నాతో కూడా నా సింహాసనము నందు కూర్చుండ నిచ్చెదను" అని తనకు కలిగిన దర్శనంలో యోహానుతో యేసు ప్రభువు చెప్పారు.(ప్రకటన 3:21). "ఆయన బలాతిశయము చేత క్రీస్తును మృతులలోనుండి లేపి ...... పరలోక మునందు ఆయనను తన కుడిపార్శ్వమున కూర్చుండ బెట్టుకొని యున్నాడు" (ఎఫెసి 1:20) అని పౌలు తన పత్రికలో చెబుతున్నాడు. కొలస్సీయులకు ఇలా చెబుతున్నాడు: "మీరు క్రీస్తుతో కూడ లేపబడిన వారైతే పైనున్న వాటినే వెదకుడి, అక్కడ క్రీస్తుదేవుని కుడిపార్శ్వమున కూర్చుండి యున్నాడు" (కొలస్సీ 3:1; హెబ్రీ 12:2, 1పేతురు 3:22). అపొ.కా. 7వ అధ్యాయంలో స్తెఫను హతసాక్షి కావడం మనం చూస్తాం. యూదుల అధికారులు స్తెఫను మాటలు వినినపుడు ఆత్మతో నిండుకొనినవాడై ఆకాశమువైపు తేరి చూచి, దేవుని మహిమను, యేసుదేవుని కుడిపార్శ్వ మందు నిలిచి యుండుటను చూచెను" (అపొ.కా. 7:54,55). ఆయన కొరకు నిలువబడి, మృతి చెందిన హతసాక్షి కోసం యేసుక్రీస్తు నిలుచుండి ఆహ్వానించారు.

రాజులకు రాజు, ప్రభువులకు ఈ భూమిపై ఆయన రాజ్యం స్థాపించారు. దాని నిమిత్తమే క్రీ॥పూ 600లో దానియేలు ప్రవక్త ప్రవచించాడు. "ఆరాజుల కాలములలో పరలోకమం దున్న దేవుడు ఒక రాజ్యము స్థాపించును. దాని కెన్నటికిని నాశనము కలుగదు. అది ముందు చెప్పిన రాజ్యములన్నిటిని పగులగొట్టి నిర్మూలము చేయును గాని అది యుగయుగముల వరకు నిలుచును" (దాని 2:44). మొట్టమొదటి సంఘము పెంతుకోస్తుదినమున ఏర్పడినప్పటి నుండి క్రైస్తవయుగము ప్రారంభమైంది (అపొ.కా. 2వ అధ్యా).

యేసుక్రీస్తు యొక్క దూత అయిన బాప్తిస్మమిచ్చు యోహాను "పరలోక రాజ్యము సమీపించి యున్నది, మారు మనస్సు పొందుడి" (మత్త 3:1) అని ప్రకటించాడు. యేసు ప్రభువు పరలోక రాజ్యమును గూర్చి ప్రకటించారు. "అప్పటి నుండి యేసు -పరలోక రాజ్యము సమీపించియున్నది గనుక మారు మనస్సు పొందుడి అని చెప్పుచు ప్రకటింప మొదలు పెట్టెను" (మత్త 4:17, 23; లూకా 8:1). యేసు ప్రభువు పన్నెండుగురు శిష్యులను ఏర్పరచుకొని వారిని ఇశ్రాయేలీయులలో నశించిన గొర్రెల యొద్దకు పంపుతూ పరలోక రాజ్యము సమీపించియున్నది అని

ప్రకటించుడి అని తెలిపారు (మత్త 10:7). విత్తువాని ఉపమానములో ఆయన తన శిష్యులకుచెబుతూ "ఎవడైనను రాజ్యము ను గూర్చిన వాక్యము వినియు గ్రహింపక యుండగా" (మత్త 13:19) అంటూ మత్తయి 13వ అధ్యాయంలో దేవుని రాజ్యమును గురించి వివరించుటకు అనేక ఉదాహరణలు ఇచ్చారు. పునరుత్థానము తరువాత భూమి మీద నలుబది దినాలు ఆయన దేవుని రాజ్యమును గూర్చి బోధించారు. "ఆయన శ్రమపడిన తరువాత నలువది దినముల వరకు వారికగపడుచు, దేవుని రాజ్య విషయములను గూర్చి బోధించుచు, అనేక ప్రమాణములను చూపి వారికి తన్ను తాను సజీవునిగా కనుపరచు కొనెను" (అపొ.కా. 1:3).

"దేవుని రాజ్యమెప్పుడు వచ్చునని పరిసయ్యులు ఆయననడిగినపుడు ఆయన దేవుని రాజ్యము ప్రత్యక్షముగా రాదు, ఎందుకనగా ఇదిగో దేవుని రాజ్యము మీ మధ్యనే యున్నది గనుక ఇదిగో ఇక్కడనని, అదిగో అక్కడనని చెప్పవీలుపడదని వారికి ఉత్తరమిచ్చెను" (లూకా 17:20-21). మీరైతే ఆయన రాజ్యమును వెదకుడి, దానితో కూడ ఇవి మీకనుగ్రహింపబ డును, చిన్నమందా భయపడకుడి, మీకు రాజ్యము అనుగ్రహించుటకు మీతండ్రికి ఇష్టమైయున్నది" (లూకా 12:31,32 అని ఆయన శిష్యులకు చెప్పారు.

బాప్తిస్మమిచ్చు యోహానును గూర్చి యేసు ప్రభువు ఇలా చెప్పారు "స్త్రీలు కనిన వారిలో బాప్తిస్మమిచ్చు యోహాను కంటె గొప్పవాడు పుట్టలేదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. అయినను పరలోకరాజ్యములో అల్పు డైన వాడు అతని కంటె గొప్ప వాడు". (మత్త 11:11). పరలోక రాజ్యములో నున్న క్రైస్తవుడు బాప్తిస్మమిచ్చు యోహాను కంటె గొప్పవాడు ఎందు కనగా బాప్తిస్మమిచ్చు యోహాను పరలోకరాజ్యము (సంఘము) స్థాపిం చక పూర్వమే జన్మించడం మరణిం చడం జరిగిపోయినవి గనుక. యేసు ప్రభువు వారు రూపాంతరం చెందక ముందు "ఇక్కడ నిలచియున్న వారిలో కొందరు దేవుని రాజ్యము బలముతో వచ్చుటచూచువరకు మరణము రుచి చూడరని నిశ్చయముగా మీతోచెప్పు చున్నాననెను" (మార్కు 9:1). పెంతె కోస్తు దినమున దేవుని రాజ్యము శక్తితో స్థాపింపబడినపుడు ఆయన శిష్యులు ఇంకా బ్రతికే ఉన్నారు (అపొ.కా. 2). జనసమూహమునకు యేసుప్రభువు కొండమీద నుండి

ఇలాగు చెప్పారు "మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి, అప్పుడవన్నియు మీకను గ్రహింపబడును" (మత్త 6:33). నూతన యెరూషలేమే దేవునిరాజ్యము, దేవుని ఇల్లు కీర్తనాకారుడంటాడు "నీమందిర మునందు నివసించువారు ధన్యులు" (కీర్తన 84:4). నీ యింటిని గూర్చిన ఆసక్తి నన్నుభక్షించి యున్నది (కీర్తన 69:9). "యెహోవా మందిరమునకు వెళ్లుదుమని జనులు నాతో అనినపుడు నేను సంతోషించితిని" (కీర్తన 122:1). ప్రభువు ప్రార్థన తన శిష్యులకు ఎలాప్రార్థించాలో యేసు ప్రభువు వారికి నేర్పిన ప్రార్థన. అందులో ప్రభువు "నీరాజ్యము వచ్చు గాక" అని నేర్పారు (మత్త 6:9). ఎందుకనగా అప్పటి కింకా రాజ్యము స్థాపింపబడలేదు గనుక "రాజ్యము కొరకు ప్రార్థించడానికి యేసుప్రభువు వారికి నేర్పారు. రాజ్యము రావాలని మనం ప్రార్థన చేయనవుసరం లేదు ఎందుకనగా పెంతుకోస్తుదినాన క్రీ॥శ 33లో యెరూషలేములో దాని స్థాపన జరిగిపోయింది. గనుక "ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములో నుండి విడుదల చేసి, తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్య నివాసులనుగా చేసెను" అని పౌలు అంటు న్నాడు (కొలస్సీ 1:13). యేసు క్రీస్తురక్తము ద్వారా కడుగబడిన వారందరు ఆయనలోనికి బాప్తిస్మము పొంది ఆయన రాజ్యములోనికి లేదా సంఘములోనికి మార్చబడు చున్నారు. "ప్రభువు రక్షణ పొందుచు న్నవారిని అనుదినము వారితో చేర్చుచుండెను (అపొ.కా. 2:47). ఒకడు యేసు ప్రభువు నామములో బాప్తిస్మము పొందిన యెడల అతడు రక్షింపబడును (మత్త 28:19, మార్కు 16:16).

అపొస్తలుడైన యోహాను తనను గురించి ఇలా చెబుతున్నాడు "మీ సహోదరుడును యేసును బట్టి కలుగు శ్రమలోను రాజ్యములోను సహనములోను పాలివాడనైన యోహాను అను నేను (ప్రకటన 1:9). బాప్తిస్మము ద్వారా ఆయన శరీరములో చేరి ఆయన రాజ్యములో భాగముకావడానికి మనమంచి దేవుడు మనకు గొప్పఅవకాశం ఇచ్చారు. గనుక హెబ్రీగ్రంధకర్త ఇలారాస్తున్నాడు "అందువలన మనము నిశ్చలమైన రాజ్యమును పొంది దైవకృపకలిగి యుందము. ఆకృప కలిగి వినయభయ భక్తులతో దేవునికి ప్రీతికరమైన సేవ చేయుదము ఏలయనగా మన దేవుడు దహించు అగ్నియై యున్నాడు" (హెబ్రీ 12:27).

– కవిత గూటం

## సత్యము
## (Truth)

దేవుని వాక్యమే సత్యము. యోహాను 17:17

సత్యము మనలను స్వతంత్రులనుగా చేయును. యోహాను 8:32

సత్యమును మనం గ్రహించుకోగలము. ఎఫెసీ 3:3-4

దేవుని సత్యము యదార్థమైనది. కీర్తన 19:7

సత్యము బలమైనది, శక్తివంతమైనది. హెబ్రీ 14:12,13.

సత్యము నిర్దోషమైనది. కీర్తన 19:8

సత్యము మనలను శుద్ధి చేయును. అపొ.కా. 20:32

సత్యము మనలను త్రిప్పును. మత్తయి 13:15

సత్యము నిత్యము నిలుచును. మత్తయి 24:35

సత్యమునకు మనము కలుపకూడదు. ప్రకటన 22:18-19.

సత్యమునుండి తీసివేయకూడదు. ప్రకటన 22:18-19

సత్యము ప్రకటించబడాలి. 2 తిమోతి 4:2

సత్యమునందు నిలకడగా యుండాలి 2 థెస్స 2:15

సత్యమును సరిగా ఉపదేశించాలి. 2 కొరింథీ 4:2

సత్యమును బట్టి మనకు తీర్పు తీర్చబడును. యోహాను 12:48

# సంక్షిప్త వార్తలు

2014 అక్టోబరు 28 నుండి 31 వరకు జాషువాగూటం దంపతులు తెలంగాణాలో సువార్త విషయమై పర్యటించిరి. వారు మొదట సికింద్రాబాద్ యాప్రాల్‌లోను తదుపరి కరీంనగర్ జిల్లాలోను పలుచోట్ల బైబిలు తరగతులు, సువార్తకూటములు నిర్వహించిరి. 29వ తేదీ మధ్యాహ్నం కరీంనగర్ ధర్మారామ్‌లో జరిగిన కూటములో జాషువాగారు వాక్యపరిచర్యచేసిరి. అక్కడనున్న క్రీస్తు సంఘమును సోదరులు సుంచు డేవిడ్ గారు సమర్ధవంతముగా నడిపించుచున్నారు. స్థానిక సంఘస్థులు జాషువా దంపతులను శాలువలతో సత్కరించిరి. హాజరైనవారందరికీ భోజనమేర్పాటు చేయబడెను. 29వ తేదీ రాత్రి కరీంనగర్ పట్టణంలో అశోక్ నగర్‌లో మంచి సువార్తకూటము జరిగెను. పలువురు హాజరై జాషువాగారి ద్వారా క్రీస్తు సంఘచరిత్రను మొదటి నుండి నేటివరకు విని దేవుని ఆశ్చర్య సంకల్పమును గూర్చి తెలిసికొని ఆయనను స్తుతించిరి. కరీంనగర్‌లోను పరిసరప్రాంతములలోను సోదరులు గొట్టిముక్కల అబ్రాహాం గారును ఆయన కుమారులు ఐజక్, నోవ, పౌలు మరియు హానోకు అను యువకులు అనేక సంవత్సరములుగా సత్యవాక్యమును ప్రకటించుచున్నారు.

2014 అక్టోబరు 30వ తేదీ మధ్యాహ్నం కామదేగు మండలం గుండిలో జరిగిన సువార్త సభలో జాషువా గారు వాక్యోపదేశము చేయగా ఏడుగురు బాప్తిస్మము పొందిరి. గుండిలోను పరిసర ప్రాంతములలోను సోదరులు మచ్చా డేవిడ్ గారు సువార్త చాటుచున్నారు. పై జరిగిన కూటములకు సోదరులు హానోకు రాజు (రుద్రంగి). జె. జోనా (బొల్లరాం), పి. దానియేలు (యెనుగుల) హాజరై గొప్పగా సహకరించిరి. కరీంనగర్ జిల్లాలో జరుగుచున్న సువార్త సేవకొరకు ప్రార్థించమనవి. గుండిలో హజరైనవారందరికి స్థానిక సంఘము మంచి భోజనలు ఏర్పాటుచేసిరి.

2014 నవంబరు 11 నుండి 14 వరకు కాకినాడ సత్యవాణి క్రీస్తుసంఘ ఆవరణలో బైబిలు లెక్చర్‌షిప్ ఘనముగా జరిగించబడెను. ఆంధ్ర, తెలంగాణాప్రాంతములలో 14 జిల్లాల నుండియు, కర్ణాటక, ఒరిస్సా రాష్ట్రములనుండియు సోదర సోదరీలు తండోపతండములుగా వచ్చి హాజరై గొప్ప బైబిలు ప్రసంగములను విని ఆత్మీయముగా తన్మయమొందిరి. అమెరికా నుండి వచ్చిన రోజర్‌రైట్ గారును, ఆంధ్రప్రదేశ్‌నుండి సోదరులు ఎలిపే ప్రభాకర్ రావుగారు

(కాకినాడ), వి. బాబీ (అమలాపురం). ప్రేమ్‌సుధీర్ (నిడసనమెట్ట), డి. చిరంజీవి (బండార్లంక), ఓర్పు ఆదాము (నూజివీడు) ఆర్.సి. హెచ్. సద్గుణరావు (శ్రీకాకుళం), పి.జె. కృపాలిని (పలివెల) యన్. ఏలియా (దేవగుప్తం) మొదలగువారు గొప్ప బైబిలు పాఠముల నందించిరి. ప్రకాశం జిల్లానుండి వచ్చిన సోదరులు మున్నంగి బెంజమిన్, అబ్రాహాము గార్లు చక్కటి లేఖనార్థ సంగీతములను విన్పించి నేర్పించిరి. వచ్చిన వేలాది ప్రజలకు ప్రతిరోజు రుచి, శుచికరమైన భోజనము అందించబడెను. స్థానిక క్రీస్తు సంఘము స్త్రీలు, పురుషులు గొప్పగా శ్రమించి, ప్రార్థించి, కానుకలిచ్చి ఈబైబిలు లెక్చర్‌షిప్‌ను జయప్రదముగావించిరి.

ఈ లెక్చర్‌షిప్‌లో మొదటి ప్రసంగము, ఆఖరి ప్రార్థన సోదరులు ఎలిపే ప్రభాకర్ రావ్ గారు చేయుట ముదావహము. ఆనాలుగు రోజులు సత్యవాణి ఆవరణమంతా పండుగ వాతావరణముతో నింపబడెను.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP-VM/KD/02/2012-2014

To

From:
**SATYA VAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam. Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004